విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి : కలెక్టర్

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : అన్ని విద్యాసంస్థల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డైనింగ్ హాల్, కిచెన్ షెడ్‌లు శుభ్రంగా ఉంచాలన్నారు. షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థి సామర్థ్యాలను అంచనా వేస్తూ సబ్జెక్టు వారీగా విద్యా బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకన్న, టీచర్లు పాల్గొన్నారు.

టీటీడబ్ల్యూఆర్ఎస్‌ను సందర్శించిన అధికారులు

విద్యార్థులు తినే భోజనాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ దామోదర్

కేసముద్రం, జనవరి 31 : గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థిని అస్వస్థతకు గురైన వార్తలు ప్రచురితమైన నేపథ్యంలో శుక్రవారం టీటీడబ్ల్యూఆర్ఎస్‌ను అధికారులు తనిఖీ చేశారు. ఆర్‌సీవో హరిసింగ్, డీసీవో నారాయణనాయక్, తహసీల్దార్ దామోదర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వంటశాల, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. అస్వస్థతకు గురైన సంజన కుటుంబ సభ్యులు ఈ నెల 26న చికెన్ కర్రీ, చపాతి తీసుకరాగా ఆమె తినడం వల్లే వాంతులు జరిగినట్లు ప్రిన్సిపాల్ వారికి వివరించారు.

పర్యవేక్షించని అధికారులను సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : జిల్లాలో గురుకులాలను పర్యవేక్షించని ఆర్సీవో, వార్డెన్లను వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కేసముద్రం ట్రైబల్ వేల్ఫేర్ బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో దవాఖానలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ జగదీశ్‌ను అడిగి తెలుకున్నారు. హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ అవుతుంటే కనీసం ప్రథమ చికిత్స అందించకుండా ఇంటికి పంపించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బాలు నాయక్, హతీరామ్, రాము పాల్గొన్నారు.

చిన్నారులకు రెడ్యా ఆశీర్వాదం

చిన్నారులను ఆశీర్వాదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్, జనవరి 31 : డోర్నకల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొత్త రాధిక-వీరన్న కుమారైల నూతన వస్త్రాలంకరణ వేడుక శుక్రవారం డోర్నకల్ రైల్వే ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వేడుకకు మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ధరంసోత్ బాలూ నాయక్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాయల వెంకటేశ్వర్లు, కాలా యశోదర్ జైన్, మాన్యు పాట్నీ, బోరగళ్ల శరత్ బాబు, కందుల అరుణ, కాడెం బాబు, చంద్ర శేఖర్, తేజావత్ రమేశ్, రాంభద్రం, అజిత్ మియా, మల్లేశం, శ్రీను పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించి, వాహనాలను నడపాలని డీటీవో జయపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పాతిమా హైస్కూల్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, తగిన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ సాయి చరణ్, వెంకట్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా జంతు సంక్షేమ పక్షోత్సవాలు

కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్లు

డోర్నకల్, జనవరి 31 : జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం డోర్నకల్ మున్సిపల్ కేంద్రంలో కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలను పశు వైద్యాధికారి పీ నాగేశ్వరరావు వేశారు. అనంతరం డోర్నకల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సురేశ్ కుమార్, సిబ్బంది చంద్రయ్య, సులేమాన్, చంద్రయ్య, వెంకన్న, పశుమిత్రలు రజిత, హేమలత, అశోక్, చేతన్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కురవి, జనవరి 31: మండలం కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం కుష్టు వ్యాధి నివారణ అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్లయ్య హాజరై కుష్టు వ్యాధి గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లాలు, సృజన, వార్డెన్ సుజాత, ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : ప్లాస్టిక్ కవర్ల వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో పలు దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల మానవాళికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వీటిని నియంత్రించడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, క్రాంతి, శ్రీధర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

తొర్రూరులో దొంగల హల్‌చల్

- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న వ్యాపారులు
- ఆందోళనలో ప్రజలు
- ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు


తొర్రూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కాపర్ వైర్ దొంగలించిన గది

తొర్రూరు, జనవరి 31 : తొర్రూరు పట్టణంలో వరుస దొంగతనాలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. దొంగలు రాత్రి సమయాన్ని అనుకూలంగా మార్చుకొని అనేక చోరీలకు పాల్పడుతూ వ్యాపారస్తులు, స్థానిక ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. గురువారం రాత్రి పట్టణ కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దొంగల లక్ష్యంగా మారింది. ముందుగా కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, తలుపుల తాళాలను పగలగొట్టి, ఆపరేషన్ గదిలోకి ప్రవేశించారు. లోపల ఉన్న సుమారు 80 కిలోల కాపర్ వైర్‌ను అపహరించారు. దాని విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని జూనియర్ టెలికాం అధికారి నవీన్ కుమార్ తెలిపారు. ఈ ఘటనపై నవీన్ కుమార్ మాట్లాడుతూ కాపర్ వైర్ అపహరించేందుకు వచ్చిన వ్యక్తులు టెలికాం టెక్నీషియన్‌కు సంబంధించిన వారే కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ప్రస్తుతం ఈ కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వ్యాపార సముదాయాలే టార్గెట్

దొంగలు కేవలం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకే పరిమితం కాకుండా, బస్టాండ్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. అధిక జనసంచారం ఉన్న వద్ద సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లడం, బట్టల దుకాణాలు, కిరాణా షాపుల్లో చోరీలకు పాల్పడడం లాంటి ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. అంతేకాక, దొంగలు మెకానిక్ షాపులపైనా కన్నేశారు. ఇటీవల ఓ మెకానిక్ షాపులో బీరువాను పగలగొట్టి నగదు అపహరించారు. వైన్స్ షాపులో కూడా మందు కోసం చోరీ చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ వరుస దొంగతనాలు ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

తొర్రూరులో వరుస చోరీలపై పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, దొంగలపై నిఘా పెంచామని ఎస్సై గొల్లపూడి ఉపేందర్ తెలిపారు. పట్టణంలో దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, గస్తీ పెంచి, అనుమానితుల కదలికలను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వరుస చోరీలతో తొర్రూరు పట్టణ ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడు

గూడూరు, జనవరి 31 : తప్పిపోయిన బాలుడిని గూడూరు పోలీసులు చేరదీశారు. ఎస్సై గిరిధర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఓ బాలుడు తప్పిపోయి గూడూరు మండల కేంద్రంలోని ఓ షాపు వద్ద ఉండగా గమనించిన స్థానికులు అతడి వివరాలు అడిగాడు. అతడు సరైన సమాధానం చెప్పలేకపోతుండడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అడిగినా వివరాలు చెప్పడం లేదని, బాలుడిని ఎవరైనా గుర్తుపడితే 87126 56963, 87126 56962 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్సై కోరారు.

ఆటో, కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

తొర్రూరు, జనవరి 31 : మండలంలోని ఫతేపురం సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. దంతాలపల్లి నుంచి తొర్రూరు వైపు వస్తున్న కారు, తొర్రూరు నుంచి మాటేడుకు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తాళ్ల సందీప్ గౌడ్, తాళ్ల నర్సయ్యకు రెండు కాళ్లు, చేతులు విరిగాయి. అలాగే నేనాల గ్రామానికి చెందిన మౌనికకు తీవ్ర గాయాలయ్యాయి. కారులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

దొరికిన చోరీ సొత్తు

కురవి, జనవరి 31 : మండలంలోని బేగావత్‌తండాలో గురువారం చోరీకి గురైన నగదు, బంగారం శుక్రవారం తెల్లవారుజామున దొరికింది. తండాకు చెందిన భూక్యా వీరన్న, మంగమ్మ ఇంట్లో ఎవరూలేని సమయంలో రూ.8.50లక్షల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీరోలు ఎస్సై నగేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీంతో భయానికి గురైన గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సొత్తును ఇంటిపక్కనే శుక్రవారం తెల్లవారుజామున వేసి వెళ్లిపోయారు. డబ్బు, బంగారం కనిపించడంతో బాధితులు సంతోషం వ్యక్తంచేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గూడూరు, జనవరి 31: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. తీగలవేణిలో పాకాలవాగు నుంచి ట్రాక్టర్‌లో పఠాన్ యాకూబ్ అనే డ్రైవర్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ యాజయానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే, మరో ట్రాక్టర్ కూడా ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. అయితే, ట్రాక్టర్ పత్రాలు లేనందున పూర్తి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టుకున్న బైక్‌లు, గుడుంబాను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గుడుంబా తరలిస్తున్న ఇద్దరిపై కేసు

గూడూరు, జనవరి31: గుడుంబా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి, రెండు బైకులు, 28 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్ల ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపారు. శుక్రవారం కేసముద్రం మండలం మేఘ్యాతండాలో రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా 8 లీటర్ల గుడుంబా తరలిస్తున్న స్కూటీని, గూడూరు మండలంలోని బొల్లెపల్లి శివారులో రూట్ వాచ్ నిర్వహిస్తుండగా 20 లీటర్ల గుడుంబా తరలిస్తున్న బైక్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో లకావత్ రవి, గుగులోత్ లఖన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రూట్ వాచ్‌లో సిబ్బంది బుచ్చయ్య, సుధాకర్, నరేశ్, నందకిశోర్, గద్దర్, సాయిరాం, కిశోర్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతకు జరిమానా

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : గుడుంబా విక్రేతకు రూ.50 వేలు జరిమానా విధించారు. ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలం పరిధిలోని అరంతారం గ్రామానికి చెందిన ఎడ్ల పగడయ్య గతంలో గుడుంబా సరఫరా చేస్తూ పట్టుబడితే తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయితే, మళ్లీ గుడుంబాను విక్రయిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. దీంతో తహసీల్దార్ రూ.50 వేలు జరిమానా విధించారు.

మహిళ హత్య కేసులో ఐదుగురు అరెస్టు

- పరారీలో మరొకరు
- చంపి ఇంటి ముందు పాతి పెట్టిన దుండగులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : మహిళలను హత్య చేసి, ఇంటి ముందు పాతిపెట్టిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. శుక్రవారం టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం మొండికట్ల గ్రామానికి చెందిన కాటి రాములు, లక్ష్మి 12 ఏళ్ల క్రితం బతుకు తెరువు కోసం మానుకోటకు వచ్చి సిగ్నల్ కాలనీలో ఒక గదిలో అద్దెకు ఉంటున్నారు. వారి కుమారుడు కాటి గోపీ సుతారి పని కోసం ఏపీలోని ఏలూరు వెళ్లగా అక్కడ నాగమణి అనే మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమెకు ఇదివరకే పెళ్లయి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె భర్త చనిపోవడంతో గోపి పెండ్లి చేసుకుని నాగమణి ఇద్దరు పిల్లలతో మానుకోటకు వచ్చారు. నాగమణిని గోపి పెళ్లి చేసుకోవడం అతడి తల్లిదండ్రులైన రాములు, లక్ష్మితోపాటు సోదరి దుర్గా ఆమె భర్త మహేందర్‌కు ఇష్టం లేదు. దీంతో గోపి పట్టణంలో గుండ్లకుంట కాలనీలో మరో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. కొన్నిరోజుల తర్వాత అతడు తల్లిదండ్రుల వద్దకు వెళ్తామంటే నాగమణి ఒప్పుకోలేదు. అప్పటి నుంచి గోపీ తరుచుగా తాగి వచ్చి ఆమెతో గొడవపడేవాడు. ఆమె ఇద్దరు కుమారులను సైతం కొట్టేవాడు. దీంతో గత ఏడాది ఆమె పిల్లలను ఏపీలోని మంగళగిరిలో వాళ్ల అమ్మ ఇంటికి పంపింది. అయినా తరుచుగా గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో జనవరి మొదటి వారంలో పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోపీ, నాగమణి గొడవపడ్డారు. అతడు కొట్టడంతో నాగమణికి బలమైన గాయాలయ్యాయి. దీంతో సిగ్నల్ కాలనీలోని అతడి తల్లిదండ్రులు, చెల్లెలు,బావ కిరాయికి ఉంటున్న ఇంటికి ఆమెను తీసుకెళ్లాడు. అక్కడ కూడా గొడవ జరగడంతో అదే రాత్రి గోపి ఇంట్లో నాగమణి తలపై బండతో కొట్టి చంపాడు. విషయం ఎవరికీ తెలియ కుండా ఉండాలని అదే రోజు రాత్రి ఇంటి ముందు తల్లిదండ్రులు రాములు, లక్ష్మి, చెల్లె, బావ దుర్గా, మహేందర్, మేన మామ వెంకటేశ్వర్లు సాయంతో బొంద తీసి నాగమణి మృతదేహాన్ని పాతి పెట్టారు. వారం రోజుల తర్వాత శవాన్ని తీసి, వేరే దగ్గర పాతి పెట్టాలని అనుకునే సరికి దుర్వాసన రావడంతో ఎవరికీ అనుమానం రాకుండా దాని మీద అలుకు చల్లుతూ ఉన్నారు. ఈ క్రమంలో కాలనీ వాసులు నాగమణి కనబడడం లేదని ఆమె ఆచూకీ అడగడంతో రాత్రి కిరాత్రే ఇంట్లో నుంచి అందరూ పరారయ్యారు. ఈ కేసును అనుమానాస్పద మృతిగా తీసుకుని పూర్తి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈక్రమంలో కాటి గోపీ, రాములు, లక్ష్మి, హెచ్చు మహేందర్, దుర్గను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. బత్తుల వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నాడని తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై శివ, పీసీలు రుద్రయ్య, సుధీర్‌ను ఎస్పీ అభినందించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం

మరిపెడ : ట్రాన్స్‌ఫార్మను పరిశీలిస్తున్న ఎస్ఈ నరేశ్

పెద్దవగర/మరిపెడ, జనవరి 31 : వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ జే నరేశ్ అన్నారు. వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చేపట్టిన ప్రణాళికల్లో భాగంగా శుక్రవారం తొర్రూరు, పెద్దవంగర , మరిపెడ మండలాలను ఆయన సందర్శించారు. పెద్ద వంగర మండలం పోచంపల్లి సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా 33కేవీ ఫీడర్‌ను వడ్డేకొత్తపల్లి నుంచి ఏర్పాటు చేసే పనులను స్వయంగా పర్యవేక్షించారు. అదనంగా తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో దాదాపు 114 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, మరిపెడలోని బోడా అమృతండా శివారులో ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. అదనంగా అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తొర్రూరు డివిజనల్ ఇంజినీర్ మధుసూదన్, ఏడీ చలపతిరావు, ఏఈ రమేశ్‌బాబు, సబ్ ఇంజనీర్ నిహాల్, మరిపెడ సబ్ డివిజన్ ఏడీఈ బీ అజయ్, ఏఈలు పావని, నవ్య పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

డోర్నకల్, జనవరి 31 : తోడేళ్ల గూడెం గ్రామంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన ముగ్గురు నిందితులను డోర్నకల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ భూక్యా రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తోడేళ్ల గూడెం గ్రామానికి చెందిన పగడాల సతీశ్(27) ఈ నెల 26న మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి రాణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సతీశ్ ఆత్మహత్యకు కారణమైన ముగ్గురు నిందితులు సుంకరి వెంకన్న(ఏ1), సుంకరి పవన్(ఏ2), సంకరీ చరణ్(ఏ3)ను అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

డీటీగా శ్రీనాథ్ బాధ్యతల స్వీకరణ

ఇనుగుర్తి, జనవరి 31 : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా తోట శ్రీనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిన్నగూడూరు డీటీగా పనిచేసిన ఆయన బదిలీపై ఇనుగుర్తికి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా, ఇనుగుర్తి డీటీగా పనిచేసిన ఆకుల రవి మహబూబాబాద్ ఆర్‌డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

పీడిత శ్రామిక వర్గాల గొంతుక గద్దర్

నెల్లికుదురు : గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేఎంఎం నాయకులు

మహబూబాబాద్ రూరల్/ నెల్లికుదురు/ గూడూరు, జనవరి 31 : పీడిత శ్రామిక వర్గాల గొంతుక గద్దర్ అని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. గద్దర్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని అమర వీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ దేశంలో దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాలను చైతన్యం చేయడంలో గద్దర్ కీలకపాత్ర పోషించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో తన ఆటల పాటలతో ఎంతో మందిని మమేకం చేశారన్నారు. కార్యక్రమంలో దుడ్డేల రామ్మూర్తి, పైండ్ల యాకయ్య, సామ పాపన్న, మంద వశి కుమార్, హనుమంతు, రామచంద్రు పాల్గొన్నారు. అలాగే, నెల్లికుదురులోని అంబేద్కర్ సెంటర్‌లో జాతీయ మాలమహానాడు(జేఎంఎం) ఆధ్వర్యంలో గద్దర్ జయంతి నిర్వహించారు. గద్దర్ ఫ్లెక్లీకి జేఎంఎం జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిమల్ల మహేశ్, బొడ్డు అశోక్, కారం ప్రశాంత్, బాణాల సంజీవ, సంద అనిల్, చెదల యాకాంతం, మయ్య సాయిలు, అనిల్, దాసరి వెంకటమల్లు, బూర్గుల వెంకన్న, పీర్నాకి సుధాకర్, గార రమేశ్ పాల్గొన్నారు. గూడూరులో సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య, మాజీ ఎంపీపీ నూనావత్ రమేశ్, జిల్లా కార్యదర్శి మోకాళ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చుంచ బాలయ్య, వెంకన్న, జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డీఆర్‌డీవో మధుసూదన్ రాజు

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

మరిపెడ, జనవరి 31 : ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు హెచ్చరించారు. శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ మండలంలో 2023-24లో రూ.6,79,02,491తో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో రూ.5,37,383 వరకు అవినీతిని జరిగినట్లు గుర్తించారు. వాటిని వెంటనే రికవరీ చేయాలని డీఆర్‌డీవో ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, ఉపాధి హామీ పథకంలో రూ.5.93కోట్ల పంచాయితీ రాజ్ పనులు, ఆర్‌అండ్‌బీ పరిధిలోని మన ఊరు మన బడికి సంబంధించి రూ.2.91లక్షల పనులపై సోషల్ ఆడిట్‌లకు సంబంధించి సంబంధిత అధికారులు ఎవరూ పాల్గొనలేదు. అలాగే, వాటికి సంబంధించి ప్రజావేదికలో అధికారులు ఏమీ మాట్లాడకపోవడంతో వాటికి సామాజిక తనిఖీలు వర్తించవా? అని ప్రజా వేదికకు వచ్చిన ప్రజలు చర్చించుకున్నారు. కార్యక్రమంలో డీవీసీ మన్‌మోహన్, అంబుడ్స్ పర్సన్ ఆదామ్, ఎస్ఆర్‌పీలు చెన్నకేశవులు, కొమరయ్య, ఏసీపీ అంజిగౌడ్, ఎంపీడీవోలు కనుకదుర్గ, ధన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై సలహాలు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : మిర్చి, పత్తి పంటలకు వచ్చే తెగుళ్ల నియంత్రణపై రైతులకు సలహాలు ఇస్తూ అధిక దిగుబడులు వచ్చేలా వారికి శాస్త్రవేత్తలు ప్రోత్సాహం అందించాలని జాతీయ సంస్థ ఐఐహెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బెహరా, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానంలో క్షేత్ర దినోత్సవం, రైతులకు మిరప సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరపలో నల్లతామరను తట్టుకునేలా పంట సాగుపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మిరప పంటలను సాగు చేసి మంచి దిగుబడులు సాధించిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ చీనా నాయక్, లక్ష్మీనారాయణ, శాస్త్రవేత్తలు నాగరాజు, మాలతి శ్రీధర్, వ్యవసాయ అధికారులు విజయ నిర్మల, మరియన్న, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

సీరోలుకు బస్సు సౌకర్యం కల్పించాలి